క్లుప్తంగా

ఆధార్ నమోదుకు ప్రత్యేక క్యాంపులు

మాకవరపాలెం : ఆరేళ్లలోపు పిల్లలకు ఆధార్ నమోకు ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నామని ఎంపీడీవో సీతామహాలక్ష్మి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం బూరుగుపాలెం, వజ్రగడ, జి.వెంకటాపురం, శనివారం తూటిపాల, మాకవరపాలెం, శెట్టిపాలెం సచివాలయాల వద్ద ఆధార్ నమోదు శిబిరాలు జరుగుతాయన్నారు. పిల్లల తల్లిదండ్రులు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మారేపల్లిలో దేవదాయ భూములు కాపాడాలి



వెంకన్న

దేవరాపల్లి : మారేపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలో కోర్టు వివాదంలో ఉన్న దేవదాయ భూములు అన్యాక్రాంతం కాకుండా రక్షణ కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న కోరారు. మారేపల్లి రెవెన్యూ సర్వే నెంబర్ 115లో కోట్లాది రూపాయలు విలువ చేసే భూమి కోర్టు వివాదంలో ఉందని, అధికారులు జోక్యం చేసుకొని బోర్డులు ఏర్పాటు చేయాలని గురువారం ఆయన ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ భూములపై కవిత అగ్రో ఫామ్ యాజమాన్యం హైకోర్టును ఆశ్రయించిందని, అయితే తుది తీర్పు వచ్చే వరకు దేవదాయ శాఖ అధికారులు స్వాధీనంలోకి తీసుకోవాలని సీపీఎం నేత కోరారు.

మోదమాంబకు వెండి బహూకరణ



అమ్మవారి కోసం వెండిని సర్పంచ్ సంజీవిరావుకు అందజేస్తున్న బైరాగి

మాడుగుల రూరల్ : మండలంలో ఎం.కోడూరు గ్రామ దేవత మోదమాంబ అమ్మవారి విగ్రహం మెడలో వెండి పూలదండ కోసం గ్రామానికి చెందిన ఎస్. బైరాగి వరహాలమ్మ దంపతులు, వారి కుమారుడు రామకృష్ణ, రమాదేవి దంపతులు పావు కిలో వెండిని గురువారం బహూకరించారు. ఈ వెండిని సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావుకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసశర్మ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ, బాలికల వసతి గృహం తనిఖీ



అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీవో హేమసుందరరావు

చీడికాడ : మండలకేంద్రంలో గల అంగన్‌వాడీ కేంద్రాన్ని, బాలికల వసతి గృహాలను ఎంపీడీవో హేమసుందరరావు గురువారం ఉదయం సందర్శించారు. ఈ మేరకు ఆయన రికార్డులను పరిశీలించారు. అంగన్‌వాడీ చిన్నారులతో మాట్లాడి ఆహారపదార్థాలను తనిఖీ చేశారు. అనంతరం అద్దె భవనంలో నిర్వహిస్తున్న బీసీ బాలికల వసతి గృహంలోని వంటగదిని, బాలికలు ఉంటున్న హాలును పరిశీలించి కుక్‌ను వివరాలడిగారు. 99 మందికి ఒకటే హాల్ ఉండడం అక్కడే పెట్టెలు, భోజనాలు, నిద్రకు ఈ హాలే వినియోగిస్తున్నట్టు చెప్పారు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానన్నారు.

గిరిజనేతరులపై ఫిర్యాదులుంటే పరిశీలిస్తా



వై.బి.పట్నం రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ నాగమ్మ

రోలుగుంట : అభ్యంతరాలున్న సాగులో లేని గిరిజనేతరులపై ఫిర్యాదులందితే పరిశీలించి సాగులో ఉన్న గిరిజనులకు న్యాయం చేస్తానని తహసీల్దార్ ఎస్.నాగమ్మ అన్నారు. వై.బీ.పట్నంలో గురువారం జరిగిన రెవెన్యూ సదస్సులో మాట్లాడారు. సాగు హక్కుల వర్తింపుపై రైతులకు అవగాహన కల్పించారు. రైతుల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో డీటీ శంకరరావు, వీఆర్వో అప్పారావు పాల్గొన్నారు.

గంటల లారీ ఎంతో దూరం!



గడ్డివాముకు అంటుకున్న మంటలను ఆర్పే పనుల్లో రైతులు (ఫైల్)

- మండలంలో అందుబాటులో లేని అగ్నిమాపక కేంద్రం
- చోడవరం కేంద్రం 25 కి.మీ, మాడుగుల కేంద్రం 40కి.మీ దూరం
- ప్రమాద సమయాల్లో వాహనాల సహాయం అందక సర్వం కోల్పోతున్న బాధితులు



కె.కోటపాడు : మండల గ్రామాల్లో పలు గ్రామాల్లో తరచూ అగ్ని ప్రమాదాలు చోటు చేసుకునే సమయాల్లో బాధిత కుటుంబాలు మంటల్లో సర్వం కోల్పోతున్నాయి. ఈ అగ్ని ప్రమాదాలు అయితే వేసవికాలంలో మరింత ఎక్కువగా ఉండనున్నా యి. అగ్ని ప్రమాదాల సమయాల్లో బాధిత కుటుంబాలు విలువైన వస్తువులతో పాటు సంపాదించుకున్న నగదును ఈ అగ్ని కీలల్లో నష్టపోవాల్సిన ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. పశువుల పాకల్లో సంభవించే అగ్నిప్రమాదాల సమయాల్లో పశునష్టం రైతులు ఎదుర్కోవాల్సి వస్తోంది.

శకటం రావాలంటే గంటల సమయం..

మండలంలో అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు మంటలను అదుపు చేసేందుకు సమీప అగ్నిమాపక కేంద్రాల నుంచి సంబంధిత అగ్నిమాపక వాహనం వచ్చేందుకు గంటల సమయం పడుతుంది. దీంతో వాహనం వచ్చే సమయానికి జరగాల్సిన నష్టం జరిగిపోతోంది. కె.కోటపాడు మండలంలో గల గ్రామాలకు చోడవరం నుంచి అగ్నిమాపక వాహనం రావాలంటే కనీసం 25 కిలోమీటర్లు, మాడుగుల నుంచి రావాల్సి వస్తే 40 కిలోమీటర్లు, సబ్బవరం నుంచి రావాల్సి వస్తే 25 కిలోమీటర్లు వాహనం ప్రయాణించాల్సిన పరిస్థితి ఉంది. వాహనం చేరుకునే లోపు అందుబాటులో ఉన్న వారు అగ్నికీలలను ఆపేందుకు ఎంత ప్రయత్నించినా జరిగే నష్టాన్ని నియంత్రించలేక పోతున్నారు.

రూ.లక్షల్లో నష్టం..

అగ్నిప్రమాదాల సమయాల్లో పూరిపాకల్లో బట్టలు, నిత్యావసర వస్తువులు, ఎలక్ట్రికల్ సామాన్లు బాధితులు నష్టపోతున్నారు. పంట పొలాల్లో రైతుల పశువుల పాకలకు మంటలు అంటుకుంటే మూగజీవాలు అగ్ని కీలల్లో బలవుతున్నాయి. సమీపంలో ఉండే వరికుప్పలు, గడ్డివాములు, సరుగుడు, యూకలిప్టస్‌తోటలు అగ్నికి ఆహుతవుతున్నాయి. అగ్నిప్రమాద సమయాల్లో రైతులకు వాటిల్లే నష్టం రూ.లక్షల్లో ఉంటోంది. కె.కోటపాడు, దేవరాపల్లి మండలాలకు గాను ఒక అగ్ని మాపక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే సకాలంలో అగ్ని ప్రమాదాలు జరిగే సంఘటన స్థలాలకు చేరుకుని అగ్నికీలలను నియంత్రించే అవకాశం ఉంటుందని మండల ప్రజలు కోరుతున్నారు.



అగ్నిమాపక కేంద్రం అవసరం

కె.కోటపాడు, దేవరాపల్లి మండలాలు రెండు పక్కపక్కనే ఉన్నాయి. ఈ రెండు మండలాల్లో అగ్నిప్రమాదాలు సంభవించినపుడు అగ్నిమాపక వాహనాలు రావాలంటే ప్రయాణ సమయం ఎక్కువ అవుతుంది. రెండు మండలాల్లో జరిగే అగ్నిప్రమాదాల సమయాల్లో నష్ట పరిస్థితులు నివారించడానికి దగ్గరలో అందుబాటులో ఒక అగ్నిమాపక కేంద్రాన్ని మంజూరు చేయాలి. ఈ కేంద్రాన్ని ఆనందపురంలో ఏర్పాటు చేస్తే రెండు మండలాలకు ఉపయుక్తంగా ఉంటుంది.

– వంటాకు అప్పాజీ, సర్పంచ్, ఆనందపురం

వరుస తుపానులతో అన్నదాత కుదేలు

- కోసిన వరి పంటను పొలాల్లోనే కుప్పలుగా..
- మొలకెత్తుతున్న ధాన్యం



వీరనారాయణం వద్ద కోసిన వరి పంట



ఎం. కోడూరు వద్ద పంట భూముల్లో ఒడ్డుకు చేర్చుతున్న రైతులు



రోలుగుంట : పంట కోయకముందే ఈదురు గాలుకు నేలవాలి దెబ్బతిన్న వరిపంట

మాడుగుల రూరల్ : బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడన ప్రభావంతోఈ నెల 17 వ తేదీ నుంచి కురుస్తున్న వర్షాలతో అన్నదాత కుదేలయ్యాడు. కోసిన వరి పంటను ఒడ్డుకు చేర్చుడానికి రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కోసిన వరి పంట నాలుగు రోజులుగా పడిన వర్షాలకు తడిసి ముద్దయింది. ఆదివారం కాసిన ఎండకు వరి పనలు ఆరబెట్టారు. సోమవారం పంటను ఎత్తుదామంటే మళ్లీ వర్షం ఆటంకంగా మారింది. దీంతో పంట భూమిలో కోసిన పంటను గాలికుప్పలుగా పెడుతున్నారు. మరి కొన్ని గ్రామాల్లో వరి పనలను ఒడ్డుకు చేర్చారు. వర్షపు నీరు వరి పనల మీద పడి మొలకెత్తడానికి అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గురువారం నుంచి వాన తగ్గుముఖం పట్టడంతో వరి పంటను ఒడ్డుకు చేరుస్తున్నారు.

వరి పంట వర్షార్పణం

రోలుగుంట : తుపాను వర్షాలకు మండలంలో పంట పండిపోయి, గింజలు (ధాన్యం) నేలరాలిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. అయిదు రోజుల క్రితం రైతులు పంటకోసి పనలు ఆరబెట్టుకున్నారు. మరుసటి రోజు నుంచి వర్షాలు దంచుతున్నాయి. దీంతో కొందరు రైతులు తడిచిన పంటనే కుప్పలు పెట్టుకున్నారు. మరికొందరు రైతులు కూలీలు దొరకక, దొరికిన యంత్రాలతో నూర్పులు చేసుకున్నారు. అవకాశం లేని చోట భూమిలోనే వదిలేసిన వరి పనలు మొలకెత్తే పరిస్థితి ఏర్పడింది. కోయకుండా వదిలేసిన వరి చేను ఈదురుగాలులకు నేలవాలి పోయి నష్టం చేకూర్చింది. అధికారులు నష్టం అంచనాలు వేసి ప్రభుత్వం దృష్టికి నివేదిక అందజేసి పరిహారం అందేలా చేయాలని రైతులు కోరుతున్నారు.

శివాలయంలో ముగిసిన హోమం

మాడుగుల రూరల్ : ఎం. కోడూరు కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న హోమాది కార్యక్రమాలు, రుద్రాభిషేకం గురువారంతో ముగిసాయి. విశాఖపట్నం సుజాత నగర్‌కు చెందిన చర్ల సత్యనారాయణ, కాశీఅన్నపూరణ దంపతులు ఆధ్వర్యంలో ఈ నెల 24 వ తేదీ నుంచి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అదే రోజు ఉదయం నుంచి రాత్రి వరకు వేదపండితుల సమక్షంలో సుబ్రమణ్యస్వామి షడావర్ణార్చన, 25న మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, గురువారం ఉదయం నుంచి మహా చండీహోమం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు నిష్టలమూర్తి పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు చింతా వెంకట నారాయణమూర్తి, కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలగాలి



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న చోడవరం కోర్టు జడ్జి శ్రీనివాసరావు

బుచ్చెయ్యపేట : విద్యార్థులు చిన్నతనం నుంచి సత్ప్రవర్తనతో మెలగాలని చోడవరం కోర్టు సివిల్ జడ్జి టి. శ్రీనివాసరావు అన్నారు. బుచ్చెయ్యపేటలో గల జాజిమొగ్గల పాఠశాలలో గురువారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. పాఠశాల స్థాయిలో క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలన్నారు. భావితరాలకు మార్గదర్శకంగా విద్యార్థులను తయారు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వడ్డాదిలో వంగవీటి రంగా వర్ధంతి

బుచ్చెయ్యపేట : దివంగత వంగవీటి మోహన్‌రంగా 36 వర్ధంతి సందర్భంగా వడ్డాదిలో వంగవీటి మోహన్‌రంగా విగ్రహం వద్ద ఆయన అభిమానులు గురువారం నివాళులు అర్పించారు. విగ్రహానికి పూలమాలలు వేసి జోహర్లు అర్పించారు. బడుగు, బలహీన వర్గాలకు ఆయన చేసిన సేవలు శ్లాఘనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో దొండా నారాయణమూర్తి, దొండా గిరిబాబు, దొండా నరేష్, సయ్యపురెడ్డి జనార్దన్, హరీష్, శంకర్‌వాసు, ఆది హరీష్, బొబ్బాది జగదీష్, బొబ్బాది సాయి, వినయకుమార్, దుర్గాప్రసాద్, లక్ష్మణ్, నాని, మణికంఠ పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు



గ్రామసభలో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ వేణుగోపాల్



గరుగుబిల్లిలో రెవెన్యూ సదస్సులో పాల్గొన్న అధికారులు

నాతవరం : మండలంలో వెదురుపల్లి కృష్ణాపురం రెవెన్యూ గ్రామాల్లో గురువారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. తహసీల్దార్ ఎ.వేణుగోపాల్ రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శివ, వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకుడు కాళ్ల సత్యనారాయణ, మాజీ సర్పంచ్ పారుపల్లి వెంకటరమణ, మండల సర్వేయరు ప్రసాద్ పాల్గొన్నారు.

గరుగుబిల్లిలో...

కె.కోటపాడు : గరుగుబిల్లిలో గురువారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. వివిధ భూ సమస్యల పరిష్కారానికి 8 మంది అర్జీలను అందించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ రామచంద్రమూర్తి, సర్పంచ్ ఎరుకునాయుడు, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, ఎంపీటీసీ రాజేష్, వీఆర్వోలు సురేష్, బండారు నాయుడు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మేలుకొలుపులు



ముకుందపురం రామాలయంలో మేలుకొలుపు కార్యక్రమం

మాడుగుల రూరల్: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ముకుందపురం గ్రామంలో మేలు కొలుపు కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం పుర వీధుల్లో మేలుకొలుపు అనంతరం మహిళా భక్తులు రామాలయంలో భజన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ ప్రముఖ్ కర్రి వరహాలరాజు పాల్గొన్నారు.

మాడుగుల: మండలంలో వైష్ణవి దేవాలయాల్లో నెల గంట ప్రారంభం నుంచి మేలు కొలుపులు కొనసాగుతున్నాయి. మండలంలో మాడుగుల, సత్యవరం, జేడీపేట, వొమ్మలి, వీరనారాయణం, కింతలి వల్లాపురం, ఎం.కోడూరు, శంకరం, తాటిపర్తి, చింతలూరు, తదితర గ్రామాల్లో మేలు కొలుపులు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా తెల్లవారు జామున వైష్ణవి దేవాలయాల్లో అధిక సంఖ్యలో మహిళలు ఆలయాల్లో దీపారధన అనంతరం, జై శ్రీరామ్ అంటూ గ్రామాల్లో తిరుగుతూ భక్తి భావం పెంచుతున్నారు.

అవంతిలో సాంకేతిక సదస్సు

మాకవరపాలెం : అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజులపాటు 2కె 24 పేరుతో సాంకేతిక సదస్సు నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ మోహనరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో శుక్ర, శనివారాల్లో ఈ సదస్సులు ఉంటాయని, ఇందులో విద్యార్థులు తయారు చేసిన సాంకేతిక నమూనాలను ప్రదర్శిస్తామన్నారు. డిప్లొమా, ఇంజినీరింగ్ విద్యార్థులకేకాక, 9, 10 తరగతుల విద్యార్థులకు ఈ సదస్సులు ఉపయోగపడతాయన్నారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పంచాయతీల్లో ఎస్సీ కులగణన వివరాలు

- 31లోగా అభ్యంతరాలు తెలియజేయాలి



ఎంపీడీవో సాంబశివరావు

కె.కోటపాడు : మండలంలో గల అన్ని పంచాయతీలతో పాటు 22 గ్రామ సచివాలయాల్లోను ఇటీవల నిర్వహించిన ఎస్సీ కులగణనకు సంబంధించిన వివరాలను అందుబాటులో ఉంచినట్టు ఎంపీడీవో ఎ.ఎ.సాంబశివరావు అన్నారు. ఎస్సీ వర్గానికి చెందిన వారి వివరాలపై ఎటువంటి అభ్యంతరాలు ఉన్నా ఆయా పంచాయతీ కార్యాలయాల్లో ఈ నెల 31లోగా లిఖిత పూర్వకంగా ఫిర్యాదును అందించాలని సూచించారు. ఫిర్యాదుపై వీఆర్వో, ఆర్‌ఐ, డీటీ, తహసీల్దార్ క్షేత్రస్థాయి విచారణ జరిపి తుది ఎస్సీ కులగణన జాబితా జనవరి 10న ప్రచురించనున్నట్టు ఎంపీడీవో తెలిపారు.

పోరుబాటను విజయవంతం చేయండి

మాజీ ఎమ్మెల్యే గణేష్



నర్సీపట్నం : కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీల బాదుడును నిరసిస్తూ శుక్రవారం విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసనను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ అధ్యక్షుడు వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు పేదల తరపున నిరసన కార్యక్రమం చేపట్టామన్నారు. పార్టీ నాయకులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు ఎలాగైనా అధికారంలోకి రావాలనే కాంక్షతో బూటకపు హామీలను గుప్పించారన్నారు. అధికారంలోకి రాగానే వాటిని తుంగలో తొక్కి ప్రజలను మోసం చేశారని విమర్శించారు. విద్యుత్ ఛార్జీలు పెంచబోమని, అవసరమైతే తగ్గిస్తామంటూ ఊదరగొట్టిన చంద్రబాబు అధికారంలోకి రాగానే విద్యుత్ ఛార్జీల బాదుడు మొదలు పెట్టారని మండిపడ్డారు. ప్రజల తరపున పోరుబాట పట్టామని, పార్టీ నాయకులు, కార్యకర్తలు విధిగా కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

విద్యుత్ ధర్నాకు తరలిరండి

బుచ్చెయ్యపేట : కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ చేపట్టిన విద్యుత్ ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల పార్టీ అధ్యక్షుడు కె.అచ్చింనాయుడు, జెడ్పీటీసీ దొండా రాంబాబు కోరారు. గురువారం వడ్డాదిలో విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలను పెంచబోమని చెప్పిన చంద్రబాబు గద్దెనెక్కిన ఐదు నెలల్లోనే విద్యుత్ చార్జీలను పెంచి ప్రజల నడ్డి విరుస్తున్నారన్నారు. తక్షణం ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలన్న డిమాండ్‌తో శుక్రవారం వడ్డాది విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ఉదయం 9 గంటలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టనున్న నిరసనలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. వైస్ ఎంపీపీలు దొండా లలితా నారాయణమూర్తి, గొంపా చినబాబు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జన్నానరావు, ఎంపీటీసీ కోరుకొండ లీలావతి రమణ పాల్గొన్నారు.

అధికారులు సమావేశాలకు రారేం?



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుర్ల రాజేశ్వరి

నర్సీపట్నం : అధికారులు ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాలని ఎంపీపీ సుర్ల రాజేశ్వరి పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వాడి వేడిగా సాగింది. అన్నిశాఖల అధికారులు సమావేశానికి విధిగా హాజరు కావాలని ఎంపీపీ సూచించారు. అధికారులు రాకుండా కార్యాలయ సిబ్బంది సమావేశానికి రావడం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. అన్ని శాఖల అధికారులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ ఎంపీడీవోకు సూచించారు. శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. ఆయా శాఖల ద్వారా చేపడుతున్న పనులను అధికారులు సభ దృష్టికి తీసుకువెళ్లారు. పంచాయతీ భవనం ఇరుగ్గా ఉన్నందున విస్తరించడానికి రూ.2 లక్షలు కాకుండా రూ.4 లక్షలు కేటాయించాలని గురంధరపాలెం సర్పంచ్ శానపతి వెంకటరత్నం పంచాయతీరాజ్ ఏఈ నర్సింగరావును కోరారు. సభలో కూర్చున్న సూపర్ సర్పంచ్ ఈరెల్లి రాజుబాబు కల్పించుకోవడంతో నీకు సంబంధమేమిటని వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లు వెంకటరత్నం, గొంప కన్నయ్యనాయుడు నిలదీశారు. దీంతో ఇరువురు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఎంపీపీ వారించడంతో వివాదం సద్దుమణిగింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వరి పంటకు తేమ శాతం పెరిగిందని, దీనిని సాకుగా చూపి మిల్లర్లు తరుగు పేరుతో రైతులను దోచుకుంటున్నారని కన్నయ్యనాయుడు సభ దృష్టికి తీసుకువెళ్లారు. పండించిన పంటను నాశనం చేస్తున్న కోతుల నిర్మూలనకు అటవీ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సభలో ప్రస్తావించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో కె.ఉషాశ్రీ, కార్యాలయ సూపరింటెండెంట్ రమణబాబు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అక్రమాలపై విచారణ



కొండపాలెంలో వీఆర్పీ రమణ, ఫిర్యాదుదారులను విచారణ చేస్తున్న ఎంపీడీవో నాగేశ్వర్రావు

రోలుగుంట : కొండపాలెం గ్రామంలో జరిగిన ఉపాధి పనుల్లో పనులకు హాజరుకాని వారికి బ్యాంకుల్లో కూలి డబ్బులు ఎలా జమ అయ్యాయని, ఈ విషయంలో అక్రమాలకు పాల్పడిన వీఆర్పీ ఎల్. రమణపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన పోతుగణేష్, బంటు నాయుడు, కర్రి శ్రీనివాసరావు, బంటు పరదేశి అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఎంపీడీవో వి.ఎస్.నాగేశ్వరరావు, ఉపాధి ఏపీవో ఏపీవో పి.ఈశ్వర్రావుతో కలసి గురువారం సచివాలయంలో విచారణ జరిపారు. పలువురు వీఆర్పీ తప్పిదం లేదని అభిప్రాయపడగా, మరికొందరు వీఆర్పీకి వ్యతిరేకంగా అధికారులకు విన్నవించారు. ఈ సందర్భంగా తాను ఏ విధమైన అవకతవకలకు పాల్పడలేదని, ఉపాధి పనులకు వచ్చిన వారికి కూలిడబ్బులు జమయ్యాయని వీఆర్పీ విన్నవించుకున్నాడు. తదుపరి చర్యల కోసం ఉన్నతాధికారులకు నివేదిస్తానని ఎంపీడీవో విలేకరులకు తెలిపారు. విచారణలో సాంకేతిక సహాయకులు రాము, దినేష్, మాజీ సర్పంచ్ బంటు సూర్య సన్యాసిదేముళ్లు, ఉప సర్పంచ్ బంటు చిరంజీవి, శనివాడ రమణ, సూరిబాబు పాల్గొన్నారు.

లక్ష్మమ్మ అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



లక్ష్మమ్మ అమ్మవారిని దర్శించుకున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఏడువాక సత్యారావు

చోడవరం: మార్గశిర మాసం గురువారం చోడవరం శ్రీ లక్ష్మమ్మ అమ్మవారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి కనకమహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వందలాదిగా భక్తులు తరలిరావడంతో ప్రత్యేక క్యూలైన్ల ఏర్పాటు చేసి అమ్మవారి దర్శనం కల్పించారు. అమ్మవారిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఏడువాక సత్యారావు దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ సున్న గోపాలం ఆధ్వర్యంలో కమిటీసభ్యులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు, క్షీరాభిషేకాలు చేశారు.

విద్యుత్‌ఛార్జీలపై నిరసనను విజయవంతం చేయాలి

మాడుగుల రూరల్: విద్యుత్ చార్జీల బాదుడుపై వైఎస్సార్‌సీపీ పోరుబాట కార్యక్రమం శుక్రవారం మాడుగుల విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద జరుగుతుందని మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వేమవరపు రామధర్మజ (పెదబాబు) గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మాడుగుల తాచేరు పక్కన గల విద్యుత్ ఉప కేంద్రం వద్ద సంబంధిత అధికారులకు వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. కార్యక్రమానికి మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలునాయుడు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఈర్లె అనురాధ హాజరవుతున్నారని తెలిపారు. నాలుగు మండలాల చెందిన ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు హాజరుకావలని విజ్ఞప్తి చేశారు.

ప్రజాస్వామ్య హక్కుల కోసం నిరంతర పోరు

ఘనంగా సీపీఐ శత వ్యవస్థాపక దినోత్సవం



మర్రివలసలో జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యుడు కాసుబాబు

కె.కోటపాడు : ప్రజాస్వామ్య హక్కుల కోరకు సీపీఐ నిరంతరం ప్రజల పక్షాన పోరాటం చేస్తుందని ఆ పార్టీ జిల్లా సమితి సభ్యుడు వేచలపు కాసుబాబు అన్నారు. సీపీఐ 100వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా గురువారం కె.కోటపాడు, దాలివలస, రామచంద్రపురం, మర్రివలస, పాతవలస గ్రామాల్లో జెండా ఆవిష్కరణ కార్యక్రమాలను జరిపారు. కాసుబాబు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల సమస్యలతో పాటు కార్మిక, కర్షకుల సంక్షేమం కోసం అలుపెరగని పోరాటానికి సీపీఐ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గొర్లె దేముడుబాబు, పొంతపల్లి రామారావు, చప్ప కోటి, వర్రి అప్పారావు, సీముసురు సూర్యనారాయణ, రెడ్డి అప్పలనాయుడు పాల్గొన్నారు.